క్లుప్తంగా

నారసింహుని ఆలయానికి భక్తుల తాకిడి

కోరుకొండ: స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. కొండపై వెలసిన మూలమూర్తితో పాటు, కొండ దిగువన కొలువుదీరిన స్వామి వారిని కన్నులారా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ పైన, కింద ఉన్న ఆలయాల్లో స్వామివారి మూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్కులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక, వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజల్లో కూర్చున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సేవలకు ప్రశంసలు



దివ్యాంగుడికి వీల్‌చైర్ అందిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: 14 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతినెలా వృద్ధులకు వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ పింఛన్లు అందించి సేవకి ప్రతిరూపంగా నిలిచిందని ముఖ్య అతిథులు కొనియాడారు. ఆదివారం వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని ఆనందా గార్డెన్స్‌లో వృద్ధులకు పింఛన్లు, దుప్పట్లు, దివ్యాంగులకు వీల్‌చైర్‌లు అందజేశారు. 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందచేశారు. చలపరెడ్డి రాజు కుమారుడు చలపరెడ్డి గీతా సాయి కుమార్ జ్ఞాపకార్థం దివ్యాంగుడుకి వీల్ చైర్ అందజేశారు. పి.సుష్మ తన తండ్రి జ్ఞాపకార్థం సత్యకీర్తి పేద విద్యార్థినికి రూ.5 వేలు అందజేశారు. కెవీవీఎస్ఎన్ మూర్తి రూ.6 వేలు, నల్లి నాగేశ్వర సత్యనారాయణ రూ.5 వేలు, పుచ్చల సాయి జిగీష రూ.3 వేలు విద్యాభివృద్ధి కోసం క్లబ్‌కు అందచేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, తూతిక ప్రసాద్, చలపరెడ్డి రాజు, గుబ్బల గంగా భవాని పాల్గొన్నారు.

ముగిసిన బాబా సమాధి ఉత్సవాలు

బూరుగుపూడిలో భారీ ఊరేగింపు

కోరుకొండ: మండలంలోని బాబా ఆలయాల వద్ద బాబావారి సమాధి మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ముగియడంతో బూరుగుపూడిలో బాబావారి ఊరేగింపు జరిగింది. భక్తులు బాబాను దర్శించుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించిన ఊరేగింపుతో సందడి నెలకొంది. కోరుకొండ పెట్రోలు బంకు వద్ద గల ఆలయంలో బాబాకు గులాబీ పూలతో అర్చన, హారతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. కార్యక్రమాల్లో బూరుపూడి ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, చైర్మన్ కంటే నాగకేశవరావు, కంటే సత్యచక్ర గణపతి, కోరుమిల్లి అరుణకుమార్, పెద్ద శివ, కోరుకొండలో తాడి ఆదిరెడ్డి, కేతిరెడ్డి అశోక్, బెల్లం ప్రసాద్, అల్లు జయ శ్రీ పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు

సీటీఆర్ఐ: లాలాచెరువు వద్ద గల శ్రీగోవింద క్షేత్రంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు శ్రీ పద్మావతీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి త్రయాహ్నిక ఏక కుండాత్మక వార్షిక పవిత్రోత్సవాలు జరుగుతాయని, అందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ప్రధాన అర్చకుడు తోపురాణి శ్రీమన్నారాయణ ఆచార్యులు అన్నారు. 8వ తేదీ ఉదయం 8.30 గంటలకు యాగశాల ప్రవేశం, చతుస్థానార్చనలు, అగ్ని ప్రతిష్ఠ, నిత్య, ప్రాయశ్చిత్త హోమాలు, పూర్ణాహుతి, గోష్ఠి, సాయంత్రం 5గంటలకు శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ, నిత్యవిధి, గోష్ఠి, 9వ తేదీ ఉదయం, సాయంత్రం నిత్య హోమాలు, 10వ తేదీ ఉదయం 9.30 గంటలకు మహాపూర్ణాహుతి, పవిత్రాల విసర్జన, విశేష అలంకరణ, నివేదన కుంభప్రోక్షణ, మంగళాశాసనం, మహదాశీర్వచనం, పండిత సన్మానం, స్వస్తి జరుగుతాయన్నారు.

సచివాలయ ఉద్యోగులకు తీవ్ర ఒత్తిడి

- సర్వేల పేరుతో వేధింపులు
- వలంటీర్ల పనులన్నీ వారికే
- పెరిగిన పనిభారం, నిరసనలకు దిగుతున్న వైనం



ముగ్గళ్ల గ్రామ సచివాలయం



రఘుదేవపురం గ్రామ సచివాలయం

సీతానగరం: ఉన్న గ్రామంలోనే ప్రజలకు అన్ని సేవలు అందించాలనే తపనతో గ్రామ స్వరాజ్య సాధన దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో గ్రామాల్లో అన్ని సేవలు సకాలంలో అందేవి. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లకుండానే ప్రజలకు సేవలు అందడంతో వ్యయ ప్రయాసలు తప్పేవి. నేడు కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థనే నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా దేశ చరిత్రలోనే ఎక్కడా ఎన్నడూ లేని విధంగా గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి రాష్ట్రంలో లక్షలాది మంది యువతకు ఉద్యోగవకాశాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు, పరిపాలన ప్రజల వద్దకే తీసుకొచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన సచివాలయ వ్యవస్థను కూటమి సర్కార్ భ్రష్టు పట్టిస్తోంది.

నియోజకవర్గంలో 78 సచివాలయాలు, 648 మంది ఉద్యోగులు

రాజానగరం మండలంలో 34 గ్రామ సచివాలయాలు, 272 మంది సచివాలయ ఉద్యోగులు, సీతానగరం మండలంలో 20 సచివాలయాలు, 160 మంది ఉద్యోగులు, కోరుకొండ మండలంలో 24 సచివాలయాలు, 216 మంది ఉద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వ వేధింపులను తట్టుకోలేక నిరసన కార్యక్రమాలకు దిగుతున్నారు. అధికారులకు వినతిపత్రాలు అందజేసి నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు.

సంబంధం లేని విధుల అప్పగింత

జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని విధులు అప్పగిస్తూ హీనంగా చూస్తున్నారని సచివాలయ సిబ్బంది ఉద్యోగులు లోలోన కుమిలిపోతున్నారు. తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక మదనపడుతున్నారు. రోజువారీ పనితో పాటు సర్వేలు, సమాచారం సేకరణ పేరుతో ప్రభుత్వం చేస్తున్న ఒత్తిడి కారణంగా సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఎంఎస్‌ఎంఈ సర్వే, పీసీసీ సర్వే, జియో ట్యాగింగ్ వంటి సర్వేల పేరుతో బండ చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంద రోజుల పాలన పూర్తైందని ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించే పని చేయించారు. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో అసంతృప్తి జ్వాల రగులుతోంది.

పింఛన్ల పంపిణీతో ఒత్తిడి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒకటో తేదీ తెల్లవారుజామున వలంటీర్లు ఠంచన్‌గా పింఛన్ అందించారు. నేడు సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడి పెట్టి పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. తెల్లవారు జామునే మహిళా ఉద్యోగులు లక్షల నగదు తీసుకుని పంపిణీ కోసం వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. గ్రామాల్లో అక్కడక్కడా విసిరేసినట్లు ఉండే ఇళ్ల వద్దకు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు.

జాబ్‌చార్ట్ లేదు .. ప్రమోషన్ చానల్ లేదు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు డిపార్ట్‌మెంట్, సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయలేదు. ప్రమోషన్ చానల్ ఏర్పాటు లేదు. సరైన జాబ్‌చార్ట్, పని వేళలు లేవు, సెలవులు అమలు లేవు, పబ్లిక్ హాలిడేస్ లేవు. ప్రభుత్వం వీటిపై స్పష్టత ఇవ్వకుండా ఒక మల్టీ పర్పస్ ఉద్యోగిగా వాడుకుంటోందనే ప్రచారం జరుగుతుంది.

అధిక పని ఒత్తిడి



కూటమి ప్రభుత్వంలో అధిక పని ఒత్తిడితో సతమతమవుతున్నాం. సమయపాలన లేకుండా పోయింది. పలు సర్వేల పేరులతో టార్గెట్లు ఇచ్చి పని ఒత్తిడి పెంచుతున్నారు. టార్గెట్లు పూర్తి చేయకపోతే షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. సర్వేల నుంచి విముక్తి కలిగించాలి. ఏ డిపార్ట్‌మెంట్ వారిని ఆ డిపార్ట్‌మెంట్ మాతృశాఖలో విలీనం చేయాలి. సెలవు దినాల్లో పనులు అప్పగించవద్దు

– వరసాల రామదాసు, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-6, డిజిటల్ అసిస్టెంట్, పాలచర్ల, రాజానగరం మండలం

వాటి నుంచి మమ్మల్ని తప్పించాలి



గతంలో పాఠశాలల్లో టాయిలెట్స్‌ను ఉపాధ్యాయులు ఫొటోలు తీసేవారు. వారు తీవ్ర అభ్యంతరం తెలపడంతో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత మాకు అప్పగించారు. వాటి నుంచి మమ్మల్ని తప్పించాలి. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. ప్రమోషన్ చానల్ కల్పించాలి. వేరే పనులకు కాకుండా గత ప్రభుత్వంలో చేసిన విధంగా విధులు నిర్వర్తించేలా చూడాలి

– కె.శుభాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్, కొవ్వూరు

ఉద్యోగులకు అవమానం అధికం

కూటమి ప్రభుత్వం పదహారు నెలల పాలనలో స్టిక్కర్లు అంటించడం, కరపత్రాలు పంచమనడంపై సచివాలయ ఉద్యోగులు రగిలిపోతున్నారు. ఇప్పటికే ఉద్యోగులు బహిరంగంగానే నిరసన తెలియజేస్తూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. నల్ల రిబ్బన్లు ధరించి మండల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంకా నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయంటున్నారు. గతంలో ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ వలంటీర్లతో స్టిక్కర్లు అంటించడాన్ని కోర్టులో సవాల్ చేసిందని, మరి ఇప్పుడు వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోగా ఉద్యోగులకే స్టిక్కర్లు అంటించే బాధ్యతలు అప్పగించింది. పాఠశాలలకు వెళ్లి టాయిలెట్లు ఫొటోలు తీయమంటున్నారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులపై ఎందుకింతగా ఒత్తిడి తీసుకొస్తున్నారో పాలకులకే ఎరుక. ఈ మధ్య తీవ్ర ఒత్తిడికి లోనై కొంతమంది సెక్రటరీలు అసువులు బాసిన ఘటనలు కూడా ఉన్నాయి.

జాబ్‌కార్డు లబ్ధిదారులు ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలి

బిక్కవోలు: మండంలోని జాతీయ ఉపాధిహామీ జాబ్ కార్డు లబ్ధిదారులు అందరూ ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలని జాతీయ ఉపాధి హామీ ఏపీవో అగస్టీన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన కొమరిపాలెం గ్రామంలో మాట్లాడుతూ మండలంలోని 14,998 మంది ఉపాధి హామీ పనులకు వస్తున్నారని వారందరూ ఆధార్ ఈకేవైసీ చేయించుకోవడం వలన ఉపాధి పనులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఒక వేళ ఎవరైన చేయించుకోకపోతే ఉపాధిపనులకు అవకాశం ఉండదు అని తెలిపారు. ప్రతి గ్రామంలోని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఈకేవైసీ చేస్తున్నారని తెలిపారు.

నేడు పీజీఆర్ఎస్

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కోసు అనసూయ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో ఉండి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తీసుకుని సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

ఘనంగా అన్న సమారాధన

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. ఆదివారం దేవీ నవరాత్రులు పురస్కరించుకొని గ్రామంలో వినాయకనగర్ కాలనీ కొలువైన ఉన్న రాజరాజేశ్వరీ ఆలయం వద్ద ఘనంగా అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో పందలపాక, తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు గ్రామాల్లో నుంచి భక్తులు భారీ ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలోని ఆలయం కమిటీ సభ్యులు పడాల వెంకటరెడ్డి మాస్టార్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, పడాల వీరారాఘవరెడ్డి, గొలుగూరి రామా చంద్రారెడ్డి, గొలుగూరి కోదండ రామారెడ్డి, జురజాపు జగదీష్ పాల్గొన్నారు.

ప్రజాదరణ ఉన్న వైఎస్సార్ సీపీకే భవిష్యత్తు

- మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి
- బూరుగుపూడిలో జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలు



బూరుగుపూడిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు



కొండగుంటూరు పాకలులో వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

కోరుకొండ: ప్రజాదరణతో ఉత్తేజంగా ముందుకు సాగుతున్నది వైఎస్సార్ సీపీ అని, రాబోయే కాలమంతా మనదేనని అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి కోరుకొండ మండలం బూరుగుపూడిలో పార్టీ యువ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి జిల్లా మాజీ సభ్యుడు కంటే వినయ్ తేజ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభలో సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ వల్ల ఓడినా ప్రజలకు అండగా ఉన్న పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో సేవలందించిన జక్కంపూడి రాజా ఓటమి కూడా ఆ తరహాలోనే జరిగిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంపేరిట కార్పొరేటు సంస్థలకు ధారాదత్తం చేసేందుకు కూటమి సర్కారు కుట్ర చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో యువజన విభాగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు జరపడంలో విఫలమయ్యిందన్నారు. రోజూ హైదరాబాద్–గన్నవరానికి విమాన మార్గంలో విచ్చలవిడిగా చేస్తున్న ప్రయాణాలకు ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేస్తోందన్నారు. రాజానగరాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ఘనత తన అన్న రాజాకు దక్కిందన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు కంటే వినయ్‌తేజ నాయకులు జక్కంపూడి గణేష్, ఉప్పులూరి సత్యనారాయణచౌదరి, నక్కా నగేష్ తదితరులను సత్కరించారు. రాజా ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మేడపాటి షర్మిలారెడ్డి, అడబాల చినబాబు, నక్కా రాంబాబు, హారీఫ్, రాజా రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా రాజా జన్మదిన వేడుకలు

అనపర్తి: యువతకు స్ఫూర్తి, అంకితభావానికి చిహ్నం జక్కంపూడి రాజా అని అనపర్తి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా పుట్టినరోజు కార్యక్రమాన్ని అనపర్తిలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి (ఆర్కే) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుట్టినరోజు కేక్‌ను డాక్టర్ సూర్యనారాయణరెడ్డి కట్ చేశారు. అనంతరం గంగిరెడ్డి నర్సింగ్ హోమ్‌లో రోగులకు రొట్టెలు, పండ్లు పలువురు నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా వ్యక్తిత్వం, నడవడిక, తనలోని ప్రజాసేవ లక్షణాలు యువతకు ఆదర్శం కావాలని అన్నారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, పెదపూడి మండల పార్టీ కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, అనపర్తి నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేశ్వర స్వామి, పొలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, వెంకటరెడ్డి బ్రదర్స్, అనపర్తి పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు తేతల అజయ్‌రెడ్డి, మండల యువజన విభాగం నాయకులు సత్తిరాజశేఖర్‌రెడ్డి, టి.శ్యామ్, కొవ్వూరి సుబ్బారెడ్డి, పులగం రాజేష్ రెడ్డి, కె.సందీప్‌రెడ్డి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పలుచోట్ల ఉత్సాహంగా..

రాజానగరం/సీతానగరం: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పుట్టినరోజును నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు పలుచోట్ల వేడుకగా జరుపుకున్నారు. మండలంలోని కొండగుంటూరుపాకలులో మదర్ థెరిసా, శ్రీలక్ష్మీ కృష్ణ బృందావనం వృద్ధాశ్రమంలో కోనసీమ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు అబ్బిరెడ్డి వీర్రాజు ఆధ్వర్యంలో వృద్ధులతో కలసి సందడిగా జరిపారు. ఈ సందర్భంగా దూలం వెంకన్నబాబుతో కలసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దూలం నాని, తుపాకుల ప్రసన్నకుమార్, బందెల సాయిరామ్ పాల్గొన్నారు. సీతానగరంలో పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్‌ని కట్ చేసి జక్కంపూడి రాజాకు 'పుట్టినరోజు శుభాకాంక్షలు' తెలియజేశారు. ఎంపీపీ గుర్రాల జోత్స్న, వైస్ ఎంపీపీ సత్యం మదన్‌బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, వలంటీర్ల విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ బాబు, రైతు విభాగం కార్యదర్శి వలవల వెంకట్రాజు, పెన్షన్ల విభాగం అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొంద్రపు ముత్యాలు, కవల కృష్ణమూర్తి, నాని జొన్నలగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.

చిత్రకళకే వన్నెతెచ్చిన వెంకటరత్నం



ప్రఖ్యాత చిత్రకారుడు రామకృష్ణను సత్కరిస్తున్న బలరామ నాయుడు తదితరులు

సీటీఆర్ఐ: చిత్ర కళ ఆచార్యునిగా చిత్రకళకే వన్నె తెచ్చిన ఘనత వరద వెంకటరత్నందే అని ఆంధ్రకేసరి యువజన సమితి పూర్వ అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు అన్నారు. ఎందరో ప్రఖ్యాత చిత్రకారులను తయారు చేసిన వరద వెంకటరత్నం 130వ జయంత్యుత్సవం దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్ర జగతికి ఆయన చేసిన సేవల్ని పలువురు కొనియాడారు. దామెర్ల స్మారక చిత్రకళా పాఠశాల స్థాపించి 40 ఏళ్లు ఎన్నో సేవలు అందించిన వరద వెంకటరత్నం చిత్రకళకు ఆరాధ్యుడు అన్నారు. సిల్క్ వస్త్రాలపై పారదర్శక జల ప్రక్షాళన శైలిలో రంగులు వేయడంలో ఆయన ప్రత్యేకత ఉందని ఆంధ్ర కేసరి యువజన సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ రికార్డుల విజేత కేంద్రీయ విద్యాలయం చిత్రకళ ఆచార్యులు ఆత్మకూరు రామకృష్ణని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీవీఎస్ కృష్ణారావు, రఘుపాత్రుని సాయిబాబా, బెజవాడ రంగారావు, రచయిత రవికాంత్ పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాల సమర్పణ



జగన్మాతకు బోనాలు సమర్పించేందుకు దేవీచౌక్ వద్దకు తరలివచ్చిన మహిళలు

రాజానగరం: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని చక్రద్వారబంధం, దేవీచౌక్‌లో జగన్మాతకు ఆ గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం సాయంత్రం బోనాలు సమర్పించారు. తెలంగాణ సంస్కృతిలో ఒక భాగమైన బోనాల సందడి ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ దర్శనమిస్తున్న క్రమంలో చక్రద్వారబంధం గ్రామ మహిళలు కూడా భక్తి శ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, అమ్మవారికి సమర్పించారు.

గట్టుపై సాగు.. ఆదాయం బాగు



చంద్రేడులో పొలాల గట్లపై పెంచుతున్న అరటి మొక్కలు



పొలాల్లో రోడ్ల వెంబడి సాగు చేస్తున్న కంది



రోడ్లకు పొలాల మధ్య ఖాళీ స్థలాల్లో వేసిన మినుము



పొలం గట్టుపై వేసిన ఆనప పాదులు

రంగంపేట: మెట్ట ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతులు తమ పొలాల పక్కన ఖాళీగా ఉండే స్థలాల్లోనూ, గట్లపైన, రోడ్డు పక్కలా పలు రకాల అపరాలు, కూరగాయలు, ఆకు కూరల మొక్కలు పెంచుతూ అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. సాధారణంగా గట్లను, ఖాళీగా ఉండే స్థలాలను శుభ్రం చేయకపోతే పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయి అపరిశుభ్రంగా తయారవుతాయి. పరిసరాల శుభ్రత లేకపోతే పంటలపై చీడ పీడలు ఆశించే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితులను అధిగమించడానికి మండల పరిధిలోని చంద్రేడు, పెదరాయవరం, రంగంపేట, వడిశలేరు గ్రామాల్లోని నల్లరేగడి, కోటపాడు, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, జి.దొంతమూరు తదితర గ్రామాల్లో ఎర్ర రేగడి నేలల్లో వ్యవసాయం చేసే రైతులు పొలాల వెంబడి రోడ్డుకు ఇరువైపులా, గట్లపైనా, ఖాళీ స్థలాల్లో కంది, మినుము, జనుము లాంటి అపరాలు, అరటి, మిరప, బెండ, ఆనప, చిక్కుడు లాంటి కూరగాయలు, తోటకూర, గోంగూర, పాలకూర వంటి ఆకుకూరల మొక్కలు పెంచుతున్నారు. ఇలా వేసిన మొక్కలు ఎటువంటి ఎరువులు, రసాయనాలు వేయకుండానే ఏపుగా ఎదుగుతున్నాయి. తమ పంట పొలాలకు నీరు పెట్టినప్పుడే ఈ మొక్కలకు కూడా తడిని అందిస్తున్నారు. ఇలా ఖాళీ ప్రదేశాలను వదిలేయకుండా పలు రకాల మొక్కలను పెంచడం ద్వారా కుటుంబ అవసరాలు తీర్చడంతో పాటు, చిరు వ్యాపారులకు అమ్మి అదనపు ఆదాయం పొందుతున్నారు. ఈ విధంగా పొలాల పరిసరాలు శుభ్రంగా ఉంటే చేలల్లో పంటలకు తెగుళ్ల బెడద తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

26న శెట్టిబలిజ వన మహోత్సవం



శెట్టిబలిజ వన భోజన మహోత్సవం ఆహ్వాన పత్రికను ప్రారంభిస్తున్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన శెట్టిబలిజ వన మహోత్సవం, రాష్ట్ర స్థాయిలో శెట్టిబలిజ వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకులు వెల్లడించారు. ఆదివారం స్థానిక సీతంపేట మూలగొయ్యిసెంటర్‌లో శెట్టిబలిజ వన భోజన మహోత్సవం ఆహ్వాన పత్రికను స్థానిక పెద్దలు శెట్టి సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకులు సానబోయిన రామారావు మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజికవర్గ అభివృద్ధికి ఎన్నో త్యాగాలు చేసిన పెద్దల పేరిట అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. పార్టీలకు అతీతంగా అందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ, కార్యదర్శి బత్తిన ఏడుకొండలు, కోశాధికారి బొక్కా వెంకటప్రతాప్, పోలవరపు రాము, సింహం చిన్న, దూడల వెంకట విశ్వనాథ్ పాల్గొన్నారు.